క్లుప్తంగా

నేడూ అందుబాటులో రూ.300 టికెట్లు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవానికి సంబంధించి రూ.300 టికెట్ల విక్రయాలు బుధవారం సాయంత్రం వరకు పొడిగించినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మంగళవారం ప్రకటించారు. ఆన్‌లైన్‌తో పాటు సింహాచలం,నగరంలోని మహారాణిపేట, అక్కయ్యపాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిల్లో, సింహాచలంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో టికెట్లు పొందవచ్చని తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చిస్వామికి అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

ముగిసిన శిక్షణ శిబిరం

సబ్బవరం: జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో బెల్లం ,చిరు ధాన్యాలతో విలువ జోడింపు ఉత్పత్తుల తయారీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. సబ్బవరంలోని జాగృతి కార్యాలయంలో నాబార్డు సౌజన్యంతో మైక్రో ఎంటర్ ప్రైజెస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాబార్డు డీడీఎంలు సమంత్ కుమార్,రావూరి చక్రధర్ పలు అంశాలను వివరించారు. గత నెల 23 నుంచి ఈ నెల 7వ తేదీ వరకూ రెండు విడతలగా 15 రోజులు పాటు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. 30 రకాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ అందించినట్లు జాగృతి సంస్థ ఎండీ సుజాత తెలిపారు. త్వరలో బోడవరం, లంకెలపాలెంలో ఉత్పత్తులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీవీకే జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

10 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: పరవాడ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన గొలగాని గోవిందరాజు మంగళవారం 10 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు సీఐ బాలసూర్యారావు చెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అతని కేసు నమోదు చేశామని తెలిపారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం: సింహగిరి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. బుధవారం గంధం అమావాస్య పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి మంగళవారం సాయంత్రానికే భక్తులు పెద్ద ఎత్తున సింహాచలం చేరుకున్నారు. కొండ దిగువ వరాహ పుష్కరిణి తదితర ప్రాంతాల్లో బస చేశారు. బుధవారం వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి సింహగిరికి వెళ్లి స్వామిని దర్శించుకోనున్నారు.

సాగుకు ప్రోత్సాహం

సబ్బవరం: వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. ప్రతి సచివాలయం పరిధిలో రైతులకు అందుబాటులో ఉండేలా రైతు భరోసా కేంద్రాలు నిర్మించింది. వాటి కేంద్రంగా రైతులకు కావాల్సిన విత్తనాలను రాయితీపై సరఫరా చేస్తోంది.గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా సాగులో మెలుకువలు,నూతన వంగడాల సాగుచేయడం,సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులు పండించే పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుంది. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో 17 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో రైతు భరోసా కేంద్రాన్ని రూ.21.80 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధుతో నిర్మించింది. ఇప్పటికే మండలంలోని నారపాడు, ఆరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, సబ్బవరం, అమృతపురం, గొల్లలపాలెం, అసకపల్లి, గొటివాడ, పైడివాడ అగ్రహారంలోని రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో ఉపశమనం

పెందుర్తి: భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న వారికి వరుణుడి పలకరింపు ఉపశమనం ఇచ్చింది. పెందుర్తి, వేపగుంట పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వర్షం కురిసింది. సోమవారం రాత్రి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మబ్బులు కమ్ముకోవడంతో పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీచాయి. వాతావరణం చల్లబడడంతో వేసవి తాపం నుంచి ప్రజలకు ఊరట లభించింది. మంగళవారం ఉదయం సుమారు గంట పాటు ఏకధాటిగా వర్షం పడడంతో రహదారులు జలమయమయ్యాయి.

వలస పక్షులను తరిమికొట్టండి

- అభివృద్ధికి సహకారం అందించండి
- ఓటర్లకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ విజ్ఞప్తి
- ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



ప్రచార సభకు హాజరైన గంగిరెడ్ల కాలనీ ప్రజలు ప్రజలు



94 వ వార్డు వేపగుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



రవినగర్‌లో ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

పెందుర్తి: 'ఐదేళ్ల పాటు మీలో ఒక్కడిగా ఉన్నాను..ఏ కష్టం వచ్చినా ముందున్నాను..కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో మీతోనే నడిచాను..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని మీకు సక్రమంగా అందేలా చేశాను..అభివృద్ధికి బాటలు వేశాను.. కులం..మతం..పార్టీలు..ప్రాంతాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించాం..మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మమ్మల్ని ఆశీర్వదించండి'..అని వైఎస్సార్‌సీపీ పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభ్యర్థించారు. ఎన్నికల కోసం జతకట్టిన వలస పక్షులను ఓటుతో తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట, అప్పలనర్సయ్యకాలనీ, బంటా కాలనీ, ముత్యమాంబకాలనీ, గంగిరెడ్లకాలనీ, సరిపల్లి, రవినగర్ ప్రాంతాల్లో మంగళవారం అదీప్‌రాజ్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో మహిళలు, యువకులు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. ప్రచార రథంపై యువకులు పూలు చల్లుతూ అభిమానం చాటుకున్నారు. సీఎం వైఎస్ జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో, మెరుగుపరిచిన నవరత్నాల పథకాల గురించి అదీప్‌రాజ్ ప్రజలకు వివరించారు. ప్రజారంజక పాలన అందించిన వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బలపూడి భగవాన్ జయరాం, పార్టీ వార్డుల ఇన్‌చార్జి జేసీటీ ప్రసాద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఏఎంసీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, పార్టీ నేతలు ఆదిరెడ్డి మురళి, యతిరాజుల నాగేశ్వరరావు, తామర్ల నర్సింగ్, రామకృష్ణ, తిరుమల వినోద్, సంపత్‌కార్తీక్ వర్మ, బల్ల రాంబాబు, బుజ్జి, బండి సత్తిబాబు, దాసరి సత్తిబాబు, కృష్ణారెడ్డి, ఆవాల గొల్లయ్య, చినబాబు, జగదీష్, శంకర్, ఆయా కాలనీల నుంచి వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.



ముత్యమాంబ కాలనీ ప్రచారంలో పాల్గొన్న స్థానికులు

ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

వేపగుంటలో పద్మశాలి సంక్షేమ సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తమ మద్దతు అదీప్‌రాజ్‌కు ఉంటుందని సంఘం ప్రతినిధులు ముక్తకంఠంతో ప్రకటించారు. మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని..తప్పకుండా సంఘం అభ్యున్నతికి తనవంతు సహకారం అందిస్తానని అదీప్‌రాజ్ ప్రకటించారు. సంఘం ప్రతినిధులు సూరిశెట్టి సూరిబాబు, చల్లపల్లి మోహన్‌రావు, వలివెలి అమృతవల్లి, చిక్కా సత్యనారాయణ, రావర్తి సుబ్బారావు, పసగాడి సూర్యనారాయణ, శేసెట్టి కోటేశ్వరరావు, వానపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలకు సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న కేసలి అప్పారావు

సింహాచలం: ఈ నెల 10న సింహగిరిపై జరిగే వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి బాలలు కూడా వచ్చే అవకాశం ఉన్నందున వారు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. కమిషన్ సభ్యుడు సభ్యుడు గొండు సీతారాంతో కలిసి మంగళవారం సింహగిరిపై దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తితో సమావేశమయ్యారు. చంటి పిల్లలకు పాలు పట్టేందుకు ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఎంఆర్.రాధ, దేవస్థానం ఏఈవోలు ఆనంద్‌కుమార్, నరసింగరావు, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి రమణకుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముత్యమాంబ అనుపు మహోత్సవం రేపు

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని చినగొల్లలపాలెం,గోపాల్‌నగర్ ప్రజల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం గురువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం ఘటాల ఊరేగింపు,మధ్యాహ్నం అన్నసమారాధన,సాయంత్రం భారీ మందుగుండు కాల్పులతో అమ్మవారి అనుపుమహోత్సవం జరుగుతుందని తెలిపారు. బుధవారం ఉత్తరాంధ్ర స్థాయి డీజే కోలాటం పోటీలు నిర్వహించనున్నారు.ఈ పోటీల విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.12 వేలు,రూ.10 వేలు, రూ.8 వేలు అందజేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్న ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.



వెన్నలపాలెంలో నిర్మించిన సీసీ డ్రైన్

కాలువల ఆధునికీకరణ

పరవాడ: మండలంలోని 14 గ్రామ పంచాయతీలు, శివారు గ్రామాల్లో మురుగు కాలువల అభివృద్ధికి గత ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతుండేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించింది. ముఖ్యంగా పల్లెల్లో అధ్వానంగా ఉన్న మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చడానికి కంకణం కట్టుకుంది. దీంతో మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 22 సీసీ ప్రధాన కాలువల అభివృద్ధికి రూ.2.53 కోట్లు మంజూరు చేసింది. సీసీ కాలువలతో మురుగు నీటి వ్యవస్థ మెరుగుపడడంతో పల్లె ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాముడుగారి గ్రామంలో నిర్మించిన సీసీ కాలువ



మడకపాలెంలో ఏర్పాటు చేసిన సీసీ కాలువ

పతాక స్థాయికి ప్రచారం



పరవాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు తదితరులు

పరవాడ: పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడుకు మద్దతుగా మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం హోరెత్తించారు.ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

- పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ తండ్రి అన్నంరెడ్డి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ నేతలు బండారు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు వివిధ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం సాగించారు. ఉప సర్పంచ్ బండారు రామారావు, పోతల అప్పలనాయుడు, టీవీ అప్పారావు పాల్గొన్నారు.
- ముత్యాలమ్మపాలెంలో ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ తండ్రి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు, స్పీడు మసేను, చినమసేను పాల్గొన్నారు.
- నాయుడుపాలెం శివారు చేరిబండారుపాలెంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య అనుచరులతో ఇంటింటి ప్రచారం చేశారు. కె.కృష్ణంనాయుడు, కె.ఎస్.నాయుడు, ఆర్.గంగరాజు, బండారు శ్రీను పాల్గొన్నారు.
- వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఆధ్వర్యంలో రావాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు.



ముత్యాలమ్మపాలెంలో అదీప్‌రాజ్ తండ్రి సత్యనారాయణ ప్రచారం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీ, సింహపురి లేఅవుట్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. 98వవార్డు సబ్బవరపు ఇన్‌చార్జి ముత్యాలనాయుడు, వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పీతల విష్ణుమూర్తి, నడింపల్లి రామరాజు,నోళ్ల దేముడు, కె.సింహాద్రి, యశ్వంత్, నోళ్ల శ్రీను, ఎస్.శంకర్,పైడిరాజు పాల్గొన్నారు.

పెందుర్తి: జై భారత్ పార్టీ అభ్యర్థి కన్నెపల్లి మహాదేవ్ శ్రీకాంత్ పెందుర్తిలో మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం:మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. మొగలిపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గండి రవికుమార్ ఆధ్వర్యంలో యడ్ల నాయుడు, ఐ. గోపి తదితరులు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

- మల్లునాయుడుపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బోను గంగునాయుడు,ఎంపీటీసీ గొర్లి కనకరాజు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. నమూనా ఈవీఎంతో ఓటు వేయడంపై అవగాహన కల్పించారు.



బండారుపాలెంలో..



రావాడలో పార్టీ మండల అధ్యక్షుడు రామారావు



మొగలిపురంలో ఓటు వేయడంపై అవగాహన కల్పిస్తున్న గండి రవికుమార్,యడ్ల నాయుడు



మల్లునాయుడుపాలెంలో నమూనా ఈవీఎంతో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న గంగునాయుడు



సింహపురికాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



కలపాకలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ కనకారావు తదితరులు



పెందుర్తిలో ప్రచారంలో పాల్గొన్న జై భారత్ పార్టీ అభ్యర్థి శ్రీకాంత్

1180వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



1180వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కుటిల నిర్ణయానికి కార్మికులు బలవుతున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ ప్రగతి కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడిన కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తున్న కేంద్రప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1180వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఏయూలోని అల్లూరివిగ్రహానికి వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి చూపిన తెగువ, దేశభక్తి, ఆదివాసీలను సమష్టిగా నడిపించిన నాయకత్వ విధానాలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ పాల్గొన్నారు.